

## మినీకథ

# రజని

రజని మనసు కోపంతో దహించుకుపోతోంది. ఏటూ తోచక హాల్లో అటూ ఇటూ పచార్లు చేస్తూ భర్త శ్యామలరావు కోసం ఎదురు చూస్తోంది.

అంతలోనే శ్యామలరావు రానే వచ్చాడు ఆఫీసు నుండి.

"అరే. ఈ వేళ నాకన్నా ముందుగానే వచ్చేశావేమిటి ఆఫీస్ నుండి? ఏమిటీ విషయం? ఏనీ గుడ్ న్యూస్?" హాల్లోకి అడుగు పెడుతూనే ప్రశ్నించాడు.

రజని ఒక్కసారి ఆగి శ్యామలరావు ముఖంలోకి సూటిగాచూస్తూ "గుడ్ న్యూసా! నా బొందా! నేను ఛస్తే ఇక ఆ ఉద్యోగం చేయను" అంది కోపంతో.

"అదేమిటి? ఉద్యోగంలో చేరి కనీసం ఆరు నెలలు కూడా కాలేదు. అప్పుడే బోర్ కొట్టేసిందా?" అన్నాడు శ్యామలరావు సోఫా మీద కూర్చుంటూ.

"ఎన్ని నెలలయినా కాని ఇప్పటి నుంచి నేను మాత్రం ఆ ఉద్యోగం ఇక చేయను. చేయనుగాక చేయను." అంది ఆగ్రహంతో.

"అసలింతకూ ఏం జరిగింది? అసలు సంగతి చెప్పకుండా ఏమిటీ ఆకస్మిక నిర్ణయం? ఈ ఉద్యోగం గురించి నేను ఎంత మందిని బ్రతిమాలానో నీకు తెలుసా? ఇప్పుడేమో నువ్వు ఇలా ఆకస్మికంగా మధ్యలో మానేస్తానంటే నా విలువేమైనా ఉంటుందా అసలు?" అన్నాడు శ్యామలరావు.

"లేకపోతే యేమిటి? వాడు ఆ మేనేజరు– నా చెయ్యి పట్టుకుంటాడా? పైగా– 'రజనీ! టుడే యూ ఆర్ లుకింగ్ వెరీ స్మార్ట్.' అంటాడా! చెప్పు తీసుకుని చెడామడా వాయిద్దామనుకున్నా– కానీ– మీ స్నేహితుడని ఊరుకున్నాను" అంది రజని పట్టరాని కోపంతో–

"వ్వాట్! ఆ మేనేజర్ గాడు నీతో అలా మిస్‌బిహేవ్‌చేశాడా? డామిట్. వాడి పైన వెంటనే క్రమశిక్షణ చర్య తీసుకోమని ఇప్పుడే శ్రీధర్‌కు ఫోన్‌చేసి చెబుతానుండు!" అంటూ ముందుకు కదల బోయాడు శ్యామలరావు.

"వద్దులెండి! మీరా పని చెయ్యొద్దు! నేను వాణ్ణి కొట్టలేక పోయినా, చెడామడా నాలుగు తిట్టి రాజీనామా కాగితాన్ని వాడి మొహాన కొట్టివచ్చాను" అంది రజని.

"అదికాదు రజనీ! ఇంత జరిగాకా వాడిపైన ఏ చర్యా తీసుకోకపోతే నాకు నిద్ర పట్టదు!" అన్నాడు శ్యామలరావు కోపంతో.

"అబ్బబ్బ! ఇంక పోనిద్దురూ. నేను రిజైన్ చేశానుగా! ఇంకెందుకు బాధ?" అంది రజని.

శ్యామలరావు ఫోన్ చేసే ప్రయత్నం మానుకున్నాడు. తిరిగి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"పోనీ! ఇంకో ఉద్యోగం కోసం ప్రయత్నం చేయనా?" ప్రశ్నించాడు.

"నేనింక ఏ ఉద్యోగం చేయను!" అంది రజని.

"ఎందుకూ? ఊరికే ఇంట్లో కూర్చుని మాత్రం ఏం చేస్తావ్? బోర్ కొట్టదూ?" అన్నాడు శ్యామలరావు.

"ఏం చేస్తానా! వెళ్ళి మహిళా మండలిలో చేరతాను. స్త్రీ సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటాను! అటు స్త్రీ జాతికి సేవ చేసినట్టవుతూంది! ఇటు హాయిగా టైం పాస్ అవుతూంది?" అంది రజని.

"బావుంది నీ వరస! ఉన్న ఉద్యోగాన్నొదులుకుని" అంటూ ఆగాడు శ్యామలరావు.

రజని ఏమీ మాట్లాడలేక పోయింది.

* * *

"చాలా థాంక్స్‌రా! రజనితో తన ఉద్యోగానికి రాజీనామా చేయించినందుకు!" అన్నాడు శ్యామలరావు మిత్రుడు రాజారావుతో.

"చెల్లాయిలాంటి రజనితో నన్ను మిస్‌బిహేవ్ చేయించడం నాకు ఎంత బాధగా ఉందో తెలుసా?" అన్నాడు రాజారావు.

"ఫరవాలేదు! ఒక మంచి పని కోసం 'మనసులో ఏ దురుద్దేశం లేకుండా పెడుగా ప్రవర్తించినట్టు' నటిస్తే అందులో తప్పేమీలేదు!" అన్నాడు శ్యామలరావు.

రాజారావుకేమీ అర్థం కాలేదు. "మంచి పనా? ఏమిటది?" అని ప్రశ్నించాడు.

"రాజారావ్! ఈ రోజు నేను ఇంత ఉన్నత స్థితిలో ఉండడానికి కారకుడయిన ఒక వ్యక్తికి సహాయం చేయడానికి." అన్నాడు శ్యామలరావు.

"ఎవరా వ్యక్తి?" ప్రశ్నించాడు రాజారావు.

"రంగనాథం మాష్టారు. ఆయన పరిస్థితి ఏమీ బాగులేదు. వారం రోజుల క్రితం నా దగ్గర కొచ్చి వాళ్ళబ్బాయికోసం ఏదైనా ఉద్యోగం ఇప్పించమని ఎంతో దీనంగా బతిమాలాడు. నా విద్యార్థి జీవితంలో ఆయన నాకు చేసిన సహాయానికి నేను ఎంతో ఋణపడి ఉన్నాను. ఆ ఋణం ఈ విధంగానైనా సహాయం చేసి తీర్చుకుంటాను కొంతవరకు.

వాళ్ళబ్బాయికి ఉద్యోగం కావాలి. ఎన్నో ఆఫీసుల్లో ప్రయత్నించాను. కాని ప్రస్తుతం ఎక్కడా ఖాళీల్లేవు. అందుకే చివరికి ఇలా చేయవలసి వచ్చింది.

రజని ఉద్యోగం మానిపిస్తే ఆ ఉద్యోగాన్ని రంగనాథం మాష్టారు కొడుక్కి ఇవ్వొచ్చు. అంతకన్నా వేరే గత్యంతరం లేకపోయింది" అన్నాడు శ్యామలరావు.

"దేముడి దయవల్ల నేను ఇంత ఉన్నత హోదాలో ఉన్నందుకు నాకేమీ ఇబ్బంది లేదు. అన్నీ ఉన్నాయి. రజనీకి ఇంట్లో బోర్‌గా ఉందని తనే పట్టుబట్టి నాతో రెకమండ్ చేయించి మీ ఆఫీసులో ఉద్యోగం వేయించుకుంది" తిరిగి అన్నాడు శ్యామలరావు.

"నువ్వు చాలా మంచి పని చేశావ్!" అన్నాడు రాజారావు.


జ్యోతిషం

* భవిష్యత్‌లో లభించే అభివృద్ధి అ... లేమిటో తెలుసుకోవడానికి ఎస్ట్రో... రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, 13 జర్నలిస్ట్... హైదరాబాద్-34 కు రాయండి. ఫోన్: